నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, గురువారం 29 ఫిబ్రవరి 2024 | NAGARKURNOOL

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్టీసీ ఆర్ఎం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీదేవి

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 28 : ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డయల్ ఆర్ఎం కార్యక్రమంలో పాల్గొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫిర్యాదులను స్వీరించారు. మహబూబ్‌నగర్, షాద్‌నగర్, దేవరకద్ర, వడ్డెమాన్, అచ్చంపేట, కోయిలకొండ, మల్దకల్, హైదరాబాద్ నుంచి 19మంది ఫిర్యాదు చేశారు. హైదరాబాద్, నారాయణపేట బస్సుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, దివిటిపల్లికి మినీ బస్సు, షాద్‌నగర్ నుంచి 7:30 గంటల తర్వాత బస్సులు నడపాలని, లింగాల నుంచి తెల్కపల్లికి పల్లెవెలుగు బస్సులు, మహబూబ్‌నగర్ నుంచి కోయిలకొండ మీదుగా గుండుమాల్‌కు బస్సు నడుపాలని ప్రయాణికులు ఫోన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్ఎం తెలిపారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

పచ్చదనంపై పట్టింపేది?

- పల్లెప్రకృతి వనాల ఆలన కరువు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- వనాల వైపు కన్నెత్తి చూడని వైనం
- మూడు నెలలుగా నీళ్లులేక ఎండిపోయిన మొక్కలు, చెట్లు
- బోసిపోతున్న పచ్చని వనాలు
- రూ.కోట్ల వ్యయం వృథా

ఎండుతున్న వనం.. నీరుగారుతున్న లక్ష్యం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పల్లెలు పచ్చని హరితవనాలుగా మారాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాల్లో పచ్చదనం పరిఢవిల్లాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు ఆహ్లాదాన్ని అందించడం లేదు. మొక్కలు, చెట్లను సంరక్షించాల్సి ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఎండాకాలం ప్రారంభానికి ముందే వనాలపై ఆలనాపాలన లేకుండాపోవడంతో ఎక్కడికక్కడే ఎండిపోతున్నాయి. బోర్డులు మాత్రమే మిగులుతున్నాయి. నీటి కొరత.. పర్యవేక్షణ కొరవడడంతో ధ్వంసమవుతున్నాయి.

కొన్ని చోట్ల ఎండిపోయి కాలిపోతున్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోగా.. కనీసం పట్టించుకోవడం లేదు. గతంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సమిష్టిగా పనిచేస్తూ మొక్కలను రక్షించారు. కేసీఆర్ సర్కారు గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి ఖాళీ జాగాల్లో మొక్కలు నాటేందుకు వీలుగా నర్సరీలను ఏర్పాటు చేశారు. ఎకరం, అర ఎకరం.. రెండెకరాలు ఎలా ఉంటే అలా పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి పల్లె ప్రకతి వనాలను సృష్టించారు. మండలాల్లో 10, 15 ఎకరాల విస్తీర్ణంలో బృహత్ పల్లె ప్రకృతి వనాలను కూడా ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రస్తుతం ఎక్కడికక్కడే ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. నీటి కొరత ప్రధాన సమస్యగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 655 పల్లె ప్రకృతి వనాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 662, జోగుళాంబ గద్వాల జిల్లాలో 296, నారాయణపేట జిల్లాలో 254, వనపర్తి జిల్లాలో 312 చోట్ల ప్రకృతి వనాలు నిర్మించారు. ఒక్కో వనానికి రూ.4 లక్షలు ఖర్చు చేశారు. రెండు నెలల వరకు పచ్చదనంతో ఉన్న ఈ వనాలన్నీ ఇప్పుడు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి.

కళావిహీనంగా వనాలు

పల్లెప్రకృతి వనాలకు గడ్డు కాలం ఏర్పడింది. కొన్ని చోట్ల స్వచ్ఛందంగా కొందరు భూములు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. మరికొన్ని గ్రామాల్లో పట్టణాలను తల దన్నేలా పోటీ పడి సిద్ధం చేశారు. కానీ నేడు అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేక పచ్చదనం కొరవడుతున్నది. రేవంత్ సర్కారు సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఉంటే ప్రకృతి వనాలకు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని స్వయంగా తాజా మాజీ సర్పంచులే చెబుతున్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించినా చాలామంది గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జీపీలకు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని అయోమయ పరిస్థితులు తలెత్తాయి. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిశాక గ్రామ కార్యదర్శులు పంచాయతీ భారం మోయలేక పోతున్నారు. స్పెషల్ ఆఫీసర్లు చెప్పినట్లు నడుచుకునే వీలుండటంతో వాళ్లు రావడం లేదు.. వీళ్లు పట్టించుకోవడం లేదన్న చందంగా తయారైంది.

వెంటాడుతున్న నీటి కొరత

గత డిసెంబర్‌లో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అన్నీ తలకిందులయ్యాయి. కొత్తగా అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహించకపోవడంతో పాలన అటకెక్కింది. ప్రత్యేక అధికారులను నియమించినా వారు పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రధానంగా గ్రామాల్లో నీటి కొరత వెంటాడుతోంది. అవసరానికి సరిపడా నీళ్లు లభించడం లేదు. విద్యుత్ కోతలు, మోటర్లు కాలిపోవడంతో వాటి రిపేర్లకు డబ్బులు ఎవరిస్తారని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. దీంతో మొక్కలకు నీళ్లు పట్టకపోవడంతో ఇటు వనాలు, అటు నర్సరీలన్నీ దెబ్బతిన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం దేశాయిపల్లిలో మూడేండ్ల కిందట అర ఎకరం భూమిలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం సైతం అదే పరిస్థితి. ఇక్కడ దాదాపు 2 వేల మొక్కలను నాటగా ఏపుగా పెరిగాయి. రెండేండ్ల పాటు ఎన్ఆర్ఈజీఎస్ వీటి నిర్వహణ తీసుకొని సంరక్షించింది. నెల రోజులుగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంరక్షణ బాధ్యతలు చేపట్టినా ఎక్కడా చెట్లకు నీళ్లు పట్టిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో 90 శాతం చెట్లన్నీ ఎండిపోయాయి.

నారాయణపేట జిల్లాలోని పర్మాన్‌దొడ్డిలోని నర్సరీలో నీళ్లు లేక ఎండిపోవడమే కాకుండా నర్సరీల్లో ఏపుగా పెరిగిన మొక్కలు కాలిబూడిదయ్యాయి. వర్కూరు, ఉజ్జల్లి, నేరుడుగం పల్లె ప్రకృతి వనాలు కూడా నెలరోజులకే ఆనవాళ్లు లేకుండాపోయాయి.

దృష్టి సారించని స్పెషల్ ఆఫీసర్లు

ప్రతి వర్షాకాలంలో గ్రామాలు, మండలాలు, జిల్లాలో ఏటా లక్షల మొక్కలను నాటుతూ హరిత హారం కార్యక్రమాన్ని కేసీఆరర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహించింది. ఈ మొక్కలను కొనుగోలు చేసే బదులు కొంత ఖర్చు చేసి ఇక్కడే ప్లాంట్ తయారు చేయడమే కాకుండా.. పల్లెల్లో కూడా పార్కులు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో పల్లెప్రకతి వనాలకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రతి గ్రామంలో పల్లెప్రకృతి వనంతోపాటు గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ జాగాల్లో మొక్కలు నాటేందుకు ఇవి దోహదపడ్తున్నాయి. దీంతో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసి వీటిని నిర్మించింది. వీటి నిర్వహణ మూడు, నాలుగేళ్లుగా సాఫీగా సాగింది. గ్రామాల్లో అవసరమైన మొక్కలను పెంచి ఇవ్వడమే కాకుండా పల్లెల్లో పచ్చదనానికి దోహదపడ్డాయి. కాగా నెల రోజుల నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నది. దీంతో ప్రకృతి వనాలను సంరక్షించాల్సిన అధికారులు గ్రామాల్లోకి సక్రమంగా రావడం లేదు. దీంతో పర్యవేక్షణ లేక ఎక్కడికక్కడే ఎండిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నది. వచ్చే వానకాలం హరిత హారానికి లక్షల్లో మొక్కలు కావాల్సి ఉంది.. వీటిని ఎక్కడ.. ఏ విధంగా సమకూరుస్తారో అధికారులకే తెలియాలి.

మాగనూరు మండలం ఉజ్జెల్లి పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

మహ్మదాబాద్ మండలం దేశాయిపల్లిలో ఎండిన పల్లెప్రకృతి వనం

కలెక్టర్ల ఆదేశాలు బేఖాతరు

ఉమ్మడి జిల్లాలోని ఐదుగురు కలెక్టర్లు ప్రతిసారి పల్లెప్రగతిపై సమీక్షలు నిర్వహించినా కిందిస్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్ సర్కారు చేపట్టిన ఏ కార్యక్రమానికి కూడా సహకరించొద్దని ఆదేశాలు రావడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడం పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పల్లెప్రకతి వనాలన్నీ ధ్వంసమయ్యాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకొని వనాలను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. లేకుంటే పల్లెల్లో పచ్చదనం కరువయ్యే పరిస్థితులు దాపురించడం ఖాయం

సమిష్టి కృషితో నియోజకవర్గ అభివృద్ధి


అయిజ ఎంపీపీ సమావేశ హాలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు, చిత్రంలో ఎమ్మెల్సీ చల్లా

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు
- అభివృద్ధి, పార్టీ పటిష్టతే ధ్యేయం
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అయిజ, ఫిబ్రవరి 28 : అధికారంలో ఉన్నా లేకపోయినా అలంపూర్ నియోజకవర్గాన్ని సమిష్టిగా అభివృద్ధి చేసుకుందామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం అయిజ ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సహకారంతో అలంపూర్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మండలాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి అలంపూర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధితోపాటు బీఆర్ఎస్ పటిష్టతే ధ్యేయమని అన్నారు. మండలంలోని 15మంది ఎంపీటీసీలు ఏకతాటిపై నిలబడి అభివృద్ధికి పట్టం కట్టారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, అందకు అనుగుణంగానే ప్రజా ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలన్నారు. అయిజ పట్టణంతోపాటు మండలాభివృద్ధికి ప్రభుత్వంతో చర్చించి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీలు కలిసికట్టుగా ఉండి మండల అభివృద్ధికి కృషి చేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి ప్రజలు మిమ్మల్నే ఎన్నుకుంటారని అన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి తెలిపారు. ఎంపీపీగా ఎన్నుకున్న ఎంపీటీసీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి, వైస్ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయిజ ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డి ఎన్నిక

- 15మంది ఎంపీటీసీల మద్దతు


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రహ్లాదరెడ్డి

అయిజ, ఫిబ్రవరి 28 : అయిజ మండల పరిషత్ అధ్యక్షుడిగా ఉప్పల-1 ఎంపీటీసీ ప్రహ్లాదరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ప్రసాదరావు ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. 15మంది ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్ హాజరుకాగా, సంతకాలు తీసుకున్నారు. అనంతరం ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డిని వెంకటాపురం ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి బలపర్చగా, చిన్నతాండ్రపాడు ఇండిపెండెంట్ ఎంపీటీసీ లక్ష్మన్న ప్రతిపాదిస్తున్నట్లు ఎన్నికల అధికారికి తెలిపారు. దీంతో ఎంపీపీ పదవికి ఎంతమంది మద్దతు తెలుపుతారని ఎన్నికల అధికారి పేర్కొనగా, ఎంపీపీ అభ్యర్థితోపాటు 13మంది బీఆర్ఎస్, ఒక ఇండిపెండెంట్, ఒక కాంగ్రెస్ ఎంపీటీసీలు చేతులెత్తి మద్దతు ప్రకటించారు. దీంతో అయిజ ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డిని ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఫలితాన్ని ప్రకటించారు. అనంతరం ఎంపీపీగా ప్రహ్లాదరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటయ్య, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

- సెమీస్‌కు చేరిన మహబూబ్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి జట్లు

రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడుతున్న క్రికెట్ జట్లు

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 28 : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహిస్తున్న అండర్-14 విభాగం బాలుర 67వ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం మినీస్టేడియం మైదానంలో మూడోరోజు జరిగిన లీగ్ మ్యాచుల్లో ఆదిలాబాద్‌పై రంగారెడ్డి జట్టు విజయం సాధించగా, రెండో మ్యాచ్‌లో నల్గొండపై వరంగల్, మూడో మ్యాచ్‌లో మెదక్‌పై కరీంనగర్, మహబూబ్‌నగర్‌పై హైదరాబాద్, రంగారెడ్డిపై ఖమ్మం జట్లు గెలుపొందాయి. పాయింట్ల వారీగా మహబూబ్‌నగర్, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకులు విద్యాసాగర్, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ రమేశ్‌బాబు, టోర్నీ ఆర్గనైజర్లు, ఎంపైర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ముందుకు సాగుదాం

- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- మాజీ మంత్రి చొరవతో సద్దుమణిగిన అవిశ్వాస సమస్య
- రాజీనామాకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన చైర్మన్, వైస్‌చైర్మన్

బీఆర్ఎస్ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

వనపర్తి, ఫిబ్రవరి 28 : పట్టణాభివృద్ధికి కౌన్సిలర్లు కలిసికట్టుగా ముందుకు సాగాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో అసంతృప్తి కౌన్సిలర్లతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి పాల్గొని సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఏర్పడిన నాలుగేండ్ల 2 నెలల్లో అనేక పనులను విజయవంతంగా చేపట్టామని, దానికి కౌన్సిలర్లు కూడా ఎంతోగానో సహకరించారన్నారు. జిల్లా కేంద్రంలో మిషన్ భగీరథ, రోడ్ల విస్తరణ, అంతర్గత రోడ్లు పూర్తి కావచ్చాయని, మిగిలిపోయిన పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీఅందరిపై ఉందన్నారు. వచ్చే పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలన్నారు. అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగితేనే రాజకీయ భవిష్యత్ ఉంటుందని, లేకపోతే ఇతర పార్టీలతో చులకన కావాల్సి వస్తుందని హితవు పలికారు. అనంతరం రెండు రోజుల కిందట కలెక్టర్‌కు ఇచ్చిన ఆవిశ్వాస నోటీస్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అందరి అభిప్రాయం మేరకు తాము స్వచ్ఛందంగా పదవులకు రాజీనామా చేస్తామన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని మాజీ మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పుట్టపాకల మహేశ్, బండారు కృష్ణ, నాగన్నయాదవ్, లక్ష్మీనారాయణ, పాకనాటి కృష్ణ, జంపన్నయాదవ్, నందిమల్ల శ్యామ్,కో ఆప్షన్ సభ్యుడు గులాం ఖాదర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేశ్‌గౌడ్, నాయకులు శేఖర్, అశోక్, శ్రీను, శరవంద, గోపాల్‌యాదవ్, పాల్గొన్నారు.

భావోద్వేగానికి లోనైన జర్నలిస్ట్ కుటుంబం

ఆలతో భావోద్వేగంలో జర్నలిస్ట్ కుటుంబ సభ్యులు

- డబుల్ బెడ్రూం గృహ ప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే
- ఆలను చూసి ఆనందభాష్పాలు కార్చిన ఫ్యామిలీ

భూత్పూర్, ఫిబ్రవరి 28 : నూతన గృహప్రవేశం చేసిన సందర్భంగా జర్నలిస్టు కుటుంబం భావోద్వేగానికి గురైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకున్నది. భూత్పూరు మున్సిపాలిటీ పరిధిలోని సిద్ధాయపల్లి సమీపంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించింది. అక్కడ ఓ పత్రికలో పని చేస్తున్న జర్నలిస్టు కృష్ణమోహన్‌కు డబుల్ బెడ్రూం ఇల్లును నాటి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గత నవంబర్‌లో మంజూరు చేశారు. అయితే చిన్న చిన్న పనులు పూర్తయ్యాక బుధవారం కృష్ణమోహన్ గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే ఆలను అతడు ఆహ్వానించారు. ఇంట్లోకి వచ్చిన ఆలను చూసిన ఆ కుటుంబం ఒక్కసారిగా భావోద్వేగానికి గురైంది. కుటుంబ సభ్యులు కండ్ల నిండా నీళ్లు తెచ్చుకున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నందుకే మాకు ఇల్లు మంజూరైందని వారు ఆనంద భాష్పాలు కారుస్తూ చెప్పుకొచ్చారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో 34,463 మందికి గానూ 32,878మంది హాజరు
- 1,589 మంది విద్యార్థులు గైర్హాజరు

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ : ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఇంటర్ మొదటి సంవత్సరం రెండో భాష పేపర్-1 పరీక్షకు మొత్తం 34,463 మంది విద్యార్థులకు గానూ 32,878 మంది హాజరుకాగా 1589 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు నిమిషం నిబంధనను అమలు చేయడంతో చాలా వరకు విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఒకటి రెండు సెంటర్లలో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు లేటుగా చేరుకోవడంతో వారిని అనుమతించలేదు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ విద్యార్థిని పరీక్షా కేంద్రంలో స్పృహ తప్పి పడిపోగా 108లో దవాఖానకు తరలించి వైద్య చికిత్సలు చేయించిన అనంతరం తిరిని ఆ విద్యార్థినితో పరీక్ష రాయించారు. పరీక్షా కేంద్రాలను ఆయా జిల్లాల ఇంటర్మీడియట్ నోడల్ అధికారులతోపాటు స్థానిక అధికారులు తనిఖీ చేశారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచారు. ఎక్కడా కూడా మాస్‌కాపీయింగ్‌కు చోటు లేకుండా మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

'ఇంటింటా భజన' అభినందనీయం

- నీలకంఠస్వామికి పూజలు చేసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్వామికి హారతి ఇస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, ఫిబ్రవరి 28 : ఇంటింటా భజన కార్యక్రమాన్ని అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచారసమితి ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన అఖండ భజన కార్యక్రమానికి శ్రీనివాస్‌గౌడ్ హాజరై నీలకంఠస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ హయాంలో రూ.5 లక్షలు అందజేసినట్లు గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. అదేవిధంగా రవీంద్రనగర్‌లోని పోచమ్మ ఆలయంలో అమ్మవారిని మాజీ మంత్రి దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, రాజేశ్వర్, ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు నరేందర్, సతీశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ ఎంపీపీ పీఠం మళ్లీ బీఆర్ఎస్‌కే..

- ఎంపీపీగా మాలె రజితాభాస్కర్‌గౌడ్ ఏకగ్రీవ ఎన్నిక


ఎంపీటీసీలతో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ రజిత

కొల్లాపూర్, ఫిబ్రవరి 28: ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ ఎంపీపీ పీఠాన్ని మళ్లీ బీఆర్ఎస్సే కైవసం చేసుకున్నది. మండలంలోని ఎన్మన్‌బెట్ల ఎంపీటీసీ మాలె రజితాభాస్కర్‌గౌడ్‌ను ఎంపీపీగా బుధవారం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదివరకు ఉన్న ఎంపీపీ సుధారాణి పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఎంపీపీ పీఠాన్ని చేజార్చుకోకుండా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పట్టు నిలుపుకోగలిగారు. ఎన్నికల ప్రత్యేకాధికారి నాగర్‌కర్నూల్ జెడ్పీ డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో ఎంపీడీవో పట్టాభిరామారావు, పర్యవేక్షకులు శేఖర్‌గౌడ్, ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఎంపీపీ పదవికి ఎన్మన్‌బెట్ల బీఆర్ఎస్ ఎంపీటీసీ రజితాభాస్కర్‌గౌడ్ నామినేషన్ వేశారు. ఆమె నామినేషన్‌ను బోడబండతండా ఎంపీటీసీ శంకర్‌నాయక్ ప్రతిపాదించగా, రామాపూర్ ఎంపీటీసీ గనమోని వరలక్ష్మి బలపర్చారు. ఎంపీపీ అధ్యక్ష పదవికి ఒకే నామినేషన్ దాఖలుకావడంతో మిగతా నలుగురు సభ్యులు సైతం ఎంపీపీగా రజితకు అనుకూలంగా మద్దతును ప్రకటించారు. దీంతో ఎన్నికల అధికారి గోపాల్‌నాయక్ ఎంపీపీగా రజితను ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఎంపీపీకి ఎంపీటీసీలు కొండ్రబుచ్చయ్య. పాండూనాయక్, నాగేంద్రమ్మ, మంజుల, మండల కోఆప్షన్‌సభ్యుడు హరూన్‌పాషా పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జాఫర్, మాజీ జెడ్పీటీసీ కాటం జంబులయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామచందర్‌యాదవ్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు నిరంజన్, బీఆర్ఎస్ నాయకులు సురేందర్‌రావు, చింతకుంట రాఘవేందర్, సాంబశివుడుయాదవ్, సాయిరాంయాదవ్, చంద్రశేఖర్‌శెట్టి, కట్టా శ్రీనివాసులు, రామస్వామి, ధర్మయ్య పాల్గొన్నారు.

క్షుద్రపూజలు చేసిన ఇద్దరి అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాస్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28: నాగర్‌కర్నూల్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో రెండు దుకాణాల ఎదుట క్షుద్రపూజలు చేసిన సామగ్రిని వేసి భయభ్రాంతులకు గురిచేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో క్షుద్ర పూజలకు సంబంధించిన కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 26న రాత్రి 11గంటల ప్రాంతంలో బస్టాండ్ సమీపంలోని పూలు, ఫర్నిచర్ దుకాణాల ఎదుట క్షుద్రపూజలు చేసిన పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బట్టలు